జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి

- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌కే పట్టం కట్టండి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్ప


మడకశిరలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్ప


మరువపల్లిలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మడకశిర: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప కోరారు. సోమవారం పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని 3 వార్డు శివాపురంలో వారు నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే పేదలకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగనే ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీ అధినేత చంద్రబాబు తప్పుడు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. ఆయన తప్పుడు హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు.రాష్ట్ర సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి నర్సేగౌడ్, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, జీబీ శివకుమార్, రాష్ట్రబీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, డైరెక్టర్లు రామకృష్ణ, నాగరాజ్‌గౌడ్, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, మండల కన్వీనర్ రామిరెడ్డి, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్లు పార్వతమ్మ, నాగేంద్ర, లక్ష్మయ్య, బలరామ్, రమేష్, అన్సర్, గుడిబండ కన్వీనర్ యంజారేగౌడ్, తాలుకా జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, మండల జేసీఎస్ కన్వీన్ నాగేంద్రయాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జలధి ఉత్సవంలో పాల్గొన్న నాయకులు

మడకశిర పట్టణంలోని వడ్రపాళ్యంలో వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా సోమవారం జలధి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలనే టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వలసలు వస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మరువపల్లి గ్రామంలో సోమవారం మండల కన్వీనర్ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో సిద్ధగంగప్ప, లోకేష్, వెంకటేశులు, గోవిందరాజులతో పాటు 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరామని వారు తెలిపారు. సైనికుల్లా పని చేసి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను చేసుకుంటామని తెలిపారు. అనంతరం గ్రామంలో వారితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం కొత్తలంలో సుధాకర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రవిప్రతాప్‌రెడ్డిలను కలిసి మద్దతు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, మండల పీఎంపీ కన్వీనర్ మూర్తి, తాలుకా బీసీ సెల్ అధ్యక్షుడు తిమ్మప్ప, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు హనుమంతరెడ్డి, వివిధ కమిటీ సభ్యులు దివాకర్, రవి, బాలకృష్ణారెడ్డి, నారాయణ స్వామి, వెంకటేష్, గిరి, రుద్రప్ప, రఘుపతి, పుట్టయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటు వినియోగంపై నాటక ప్రదర్శన


వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

పావగడ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెల 26న చిత్రదుర్గం లోక్‌సభ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లోఅవగాహన కల్పించడానికి సోమవారం వీధి నాటకాన్ని ప్రదర్శించారు. స్థానిక కణివె లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో ప్రదర్శించిన నాటకం అందరినీ ఆకట్టుకుంది. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని పాత్రధారులు తెలిపారు. కార్యక్రమంలో స్వీప్ అధ్యక్షుడు ఈఓ జానకీరాం, చిన్మయ సంస్థ చైర్మన్ సత్య లోకేశ్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

నేడు ఊటుకూరులో ఎన్నికల ప్రచారం

పరిగి: మండలంలోని ఊటుకూరు పంచాయతీలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఇటికేపల్లి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు


తనిఖీ చేస్తున్న పోలీసులు

గుడిబండ: మండల పరిధిలోని ఇటికేపల్లి చెక్ పోస్ట్ వద్ద సోమవారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నగదు తరలింపును అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. నిబంధనలను మీరి ఎవరైనా మద్యం, నగదు, ఇతర వస్తువులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామాంజినేయులు, వెంకటేష్, ప్రకాష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

హిందూపురం అర్బన్: వివిధ కేసుల్లో పట్టుబడిన 22 ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 29న పట్టణంలోని సెబ్ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు రూ.5000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చాన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


షాకీర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం టౌన్: పట్టణంలోని 33వ వార్డు మేళాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు షాకీర్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి.. షాకీర్ స్వగృహానికి వెళ్లి మృతదేహం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కౌన్సిలర్లు శివ, ఆసీఫ్, టౌన్ జేసీఎస్ కన్వీనర్ నౌషాద్ తదతరులు నివాళులర్పించారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

పెనుకొండ: పట్టణంలోని చెరువు గేరిలో మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ మంగళవారం పర్యటిస్తారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

నృసింహునికి ప్రత్యేక పూజలు


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

పరిగి: కదిరి పున్నమి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. రోజంతా ఉపవాసం ఉండి సాయంత్రం దాసంగాలను సమర్పించిన అనంతరం భక్తులు దీక్షను విరమించారు. ఈ సందర్భంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కదిరి పౌర్ణమి వేడుకలు


లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రొద్దం: మండలంలోని పలు గ్రామాల్లో లక్ష్మీనరసింహస్వామి భక్తులు సోమవారం కదిరి పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుతున్నారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షతో సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో అన్నదానం చేపట్టారు. రొద్దకంపల్లి గ్రామ భక్తులు మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లి, మునిమడుగు, అడదాకులపల్లి, గుట్టూరు గ్రామాల్లోని ప్రజలు సోమవారం కదిరి పౌర్ణమి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాసొంగాలు ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


అలంకరణలో పాతలింగేశ్వరస్వామి

రొళ్ల: మండల పరిధిలోని గొట్టుగుర్కి గ్రామంలో వెలసిన పాతలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. తొలుత ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. తర్వాత ఆలయ ఆవరణలో స్వామివారికి వేద పండితులు కుంకుమార్చన, గణపతి పూజ, కలశ స్థాపన, అంకురార్పణ తదితర పూజలు చేశారు. ముందుగా పాతలింగేశ్వరిస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. ఈ వేడుకల్లో గ్రామానికి చెందిన వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారితో పాటు స్వామిని కొలిచే వందలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయండి

- ఎన్నికల పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి


నాయకులతో ప్రచారంపై చర్చిస్తున్న పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి

మడకశిర: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేయాలని ఆ పార్టీ పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంపై చర్చించారు. ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నాయని , ఈ నేపథ్యంలో ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని సూచించారు. అభ్యర్థుల తరుపున అన్ని మండలాల్లో ప్రచారాన్ని ప్రారంభించాలన్నారు. ప్రతి గ్రామానికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో గ్రామస్థాయి నాయకులను భాగస్వామ్యం చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త ఎన్నికల ప్రచారంలో పాల్గొనే విధంగా చూడాలన్నారు. అభ్యర్థులు అన్ని గ్రామాలను సందర్శించే విధంగా రూట్ మ్యాప్ తయారు చేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, జీబీ శివకుమార్, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, డైరెక్టర్లు రామకృష్ణ, నాగరాజ్‌గౌడ్, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, మండల కన్వీనర్ రామిరెడ్డి, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీలు సరోజమ్మ,భూతరాజు, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్లు, తాలుకా జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు



మాట్లాడుతున్న సీఐలు రాజ్‌కుమార్, మనోహర్

మడకశిర: సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టవద్దని మడకశిర రూరల్, అర్బన్ సీఐలు రాజ్‌కుమార్, మనోహర్ కోరారు. సోమవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు. ప్రధానంగా సోషల్ మీడియాపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టామన్నారు. జిల్లా స్థాయిలో సోషియల్ మీడియా పోస్టులను పరిశీలించి చర్యలు తీసుకోవడానికి ఒక కమిటీ ఉందన్నారు. కమిటీ సూచన మేరకు సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యక్తిగతంగా కించ పరిచే పోస్టులు పెట్టినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. తప్పుడు పోస్టులకు ఆయా గ్రూపుల అడ్మిన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని సరిహద్దుల్లో 9 చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 24 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా తాతయ్య ఉరుసు


గంధం ఊరేగిస్తున్న దృశ్యం


తాతయ్య దర్గాలో సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో జయమంగళీ నదీ తీరాన వెలసిన తాతయ్య స్వామి (హజరత్ సయ్యద్ షేక్ బుడేన్‌షా ఖాదరి వలీ) దర్గా ఉరుసు ఉత్సవం ఘనంగా జరిగింది. సోమవారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైన గంధం ఊరేగింపు మంగళవారం వేకువజాము వరకూ నిర్వహించారు. ఊరేగింపులో జానపద కళాకారుల బృందంచే వీరగాసే నృత్యం, ఫక్కీరుల జల్సాలతో కార్యక్రమం ఘనంగా సాగింది. వేలాది మంది భక్తులు తాతయ్య దర్గాను దర్శించుకున్నారు. ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో ఉరుసు ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.


హిందూపురం పట్టణం ముక్కిడిపేట వద్ద చిన్నారుల కేరింతలు


పెనుకొండ: హోలీ సంబరాల్లో యువకులు


మడకశిర మండలం వైజీపీ తండాలో..

సందడిగా హోలీ

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో సోమవారం హోలి పండుగను ఘనంగా నిర్వహించారు. యువకులు, మహిళలు, చిన్నారులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహం మధ్య హోలీని జరుపుకున్నారు. ముఖ్యంగా వివిధ తండాల్లో యువతీ యువకులు ఘనంగా హోలీ సంబరాలను నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ


ప్రత్యేక అలంకరణలో చోళామాంబాదేవి


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో వెలసిన చోళామాంబాదేవికి సోమవారం మండల పూజ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు వాస్తు, శాంతి, గణ హోమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలు, పండ్లతో అమ్మవారికి పంచామృతాభిషేకం, తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి మహిళా భక్తులు కుంకుమార్చన చేశారు. అలాగే అమరాపురం, పుల్లీకుంట, మద్దనకుంట, బంగారుపాళ్యం, వీరాపురం గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వడిబియ్యం, చీరలు రవికలను అమ్మవారికి కానుకగా అందజేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

నిబంధనల మేరకే చిన్నారికి వ్యాక్సిన్

రొళ్ల: మండలంలోని దొడ్డేరి పంచాయతీ పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన రాధమ్మ చెందిన మూడు నెలల (బేబీ) చిన్నారి సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. అయితే టీకాల వల్ల బిడ్డ మరణించిందని బాధిత తల్లిదండ్రులు ఆరోపించడం అవాస్తవమని పీహెచ్ఎస్ సుధారాణి 'సాక్షి'కి తెలిపారు. చిన్నారికి నిబంధనల మేరకు ఆరోగ్య కార్యకర్త ద్వారా వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న చిన్నారి జన్మించిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆరోగ్య కార్యకర్త ఆరు వారాలకు వేయాల్సిన టీకాలు శనివారం వేసినట్లు పేర్కొన్నారు. అదే గ్రామంలో మరో ఇద్దరు చిన్నారులకు టీకాలు వేశారని, వారు ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. అలాగే మండల వ్యాప్తంగా కూడా అదేరోజు ఆరోగ్య కార్యకర్తలు చిన్నారులకు టీకాలు వేసినట్లు చెప్పారు. పిల్లిగుండ్ల గ్రామానికి చిన్నారి ఇతర కారణాల వల్ల మరణించి ఉండవచ్చన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రొళ్ల: మండల పరిధిలోని ఉజ్జినిపురంకు చెందిన మణికంఠ అనే వ్యక్తి అనుమతి లేకుండా కాకి చెరువు నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా సోమవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

నారసింహా నమోస్తుతే !

- వైభవంగా కణివె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయ పరిసరాలు


అశేష భక్తజన సందోహం మధ్య సాగుతున్న నృసింహుని బ్రహ్మరథోత్సవం

పావగడ: స్థానిక కణివె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం వేలాది మంది భక్త జన సందోహం మధ్య కనుల పండువగా సాగింది. ఆలయంలో నుంచి ఉప తహసీల్దార్ ఎస్ మూర్తి నేతృత్వంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను వేద పండితులు మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య బ్రహ్మరథంలో ప్రతిష్టించారు. అనంతరం భక్తుల జయ జయ ధ్వానాల మధ్య రథాన్ని లాగారు. ఈ సందర్భంగా భక్తులు అరటి పళ్లను రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఆలయంలో కొలువు తీరిన స్వయంభూ నరసింహస్వామిని భక్తులు పెద్ద ఎత్తున సందర్శించుకున్నారు. బ్రహ్మ రథోత్సవం సందర్భంగా తరలివచ్చిన భక్తులకు పలువురు దాతలు భోజన వసతి కల్పించారు. అలాగే మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లను అందించారు. అర్చకులు అనంతరాం భట్, నరసింహ గోపాల, రఘునాథ శర్మ తదితరులు స్వామి వారికి పూజా కైంకర్యాలు నిర్వహించారు.